

# కథా కౌముది

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

## మొదటి నేస్తం

సాగి వర్మరాజు

**దాదాపు 20 సంవత్సరాల తరువాత సొంత ఊరు** వెళుతున్నందుకో ఏమో, నా మనస్సు మా ఊరి జ్ఞాపకాలతో రైలు కంటే వేగంగా ఊరుని చేరుకోవాలని పోటీపడుతోంది. రైలు కిటికీలోనుంచి దూరంగా ఉన్న చెట్లూ, కొండలు ఒక్కోటి వెనక్కి వెళ్ళిపోతున్నాయ్. ఎక్కడో వర్షం పడిన ఆనవాలుని మోసుకొస్తున్న గాలి, పాతస్నేహితుల్ని, ఊరి చెరువుని, బడిని చేలగట్లని గుర్తుకు తెస్తున్నాయ్.

ఇంతలో పల్లీలు వస్తే కొనివ్వమని ʻసిరిʼ అడుగుతుంటే, దానికి వంతపాడుతూ ʻసిద్ధుʼగాడు గారాలు పోతూ వాళ్ళమ్మని కాకా పడుతున్నాడు, ఇక లాభంలేదని పైన ఉన్న బ్యాగ్‌ని దించుతోంది నా శ్రీమతి. నేను మా ఊరిలో 8వ తరగతి దాకా చదివి తరువాత మా అమ్మమ్మ వాళ్ళ ఊళ్ళో డిగ్రీ దాకా చదవడం, తరువాత హైదరాబాద్‌లో జాబ్‌లో జాయిన్ కావడం, ʻలతʼతో పెళ్ళి బొంబాయ్ ట్రాన్స్ఫర్ కావడం ఓ పాప, బాబు పుట్టడం, నేను ఎప్పుడన్నా హైదరాబాద్ వచ్చి తమ్ముడి దగ్గర ఉన్నా అమ్మా నాన్నలని చూసి వెళ్ళటం మినహా దాదాపు ఊరు వెళ్ళింది లేదు.

లత బ్యాగ్ దించుతుంటే పిల్లల మొహాల్లో ఏదో జయించామన్న ఆనందం! నాకెందుకో వేరు శనక్కాయలు కొనుక్కుని తినాలంటే అదోలా ఉంటుంది. ఊళ్ళో ఎవరి చేలో రెండు మండలు పీకున్నా జేబుడు కాయలు వచ్చేవి. వాటికి అంటిన మట్టిని దులుపుకొని పచ్చికాయలు తింటుంటే ఆ అనుభూతి ఎంత డబ్బు పెట్టి కొన్నారాదు, ʻలతʼ బ్యాగ్‌లో నుంచి పర్స్ తీస్తుంటే సీటు క్రింద పడిపోయింది ఏదో..

పిల్లలకి కొనుక్కోమని పది రూపాయలు ఇచ్చి నేను సీటు క్రిందపడిన వస్తువుకోసం వెదుకుతుంటే, లతకే దొరికింది, చుట్టూ కాయితంతో భద్రంగా చుట్టి ఉన్న పొట్లం ఒకటి, లత పేపర్ల మడతలన్నీ తీసి అందులో ఉన్న వస్తువుని నన్ను ఆశ్చర్యంగా చూస్తూ నా చేతికి ఇచ్చింది. నేను దానిని అపురూపంగా అందుకుని చూస్తుండగా, నా భార్య ప్రశ్నార్థకంగా చూస్తూ ʻఎవరన్నా విలువైన వస్తువులని దాస్తారు, కానీ దీన్ని తిరపతి ముడుపులా ఇంత భద్రంగా దాచారంటే దీని వెనుక ఏదో విషయం ఉందన్నమాటʼ అంటుంటే, పిల్లలు నీకొకటి, నాకొకటి అని కాయలు పంచుకుంటున్నారు.

ఒక్కసారి నా నేస్తం నాకళ్ళముందు మెదిలాడు, బస్ దిగ్గానే ఊరి బయట రోడ్‌కి ఆనుకుని ఉన్న నా మొదటి స్నేహితుడింటికి వెళ్ళి, తనకి నేను తెచ్చిన బట్టలు ఇచ్చి పలకరిస్తే ఏమంటాడో! అనకపోయినా ఇవన్నీ ఎందుకు బాబు నువ్వు చల్లగా ఉండాలన్నట్లు చేతులతో చెప్తాడు. నేను పలుకరిస్తే ఎంత ఆనందిస్తాడో అన్న అనుభూతే ఇంత ఆనందంగా ఉంటే, కలిస్తే ఎంత ఆనందంగా ఉంటుందో!? ఇంతలో నా భార్య చిన్నగా కుదుపుతూ విషయం చెప్పమని అడుగుతుంటే నేను ఈ లోకంలోకి వచ్చి సరే అన్నట్లు తల ఊపగానే లత నా ప్రక్కకి జరిగి 'ఊ.. చెప్పండి' అంది. ఇంట్రెస్ట్‌గా పిల్లల వేరుశనక్కాయలు ఒలిచి తొక్కలని కవర్‌లో పోస్తున్నారు, కంపార్ట్‌మెంట్‌లో ఓ ముసలాయన కిషోర్ కుమార్ పాటలు వింటూ, మరో కుర్రాడు ఏదో బుక్ చదువుతూ, అందరూ ఎవరి పనుల్లో వాళ్ళుంటే ఎవరికీ సంబంధం లేకుండా రైలు పరిగెడుతూ ఉంది.

***

అది నేను ఆరవ తరగతి చదువుతున్నప్పుడు అనుకుంటా మా ఇంటి గోడలు పాడైపోయాయని కరణంగారి ఇంటిలోకి అద్దెకి వెళ్ళినప్పుడు, సామాన్లని ఆ ఇంట్లో సర్దుతుంటే ఏమూటలోంచి పడిందో.. ఆ వస్తువు మొదటిసారి పడింది. చిన్నగా, ఎంతో అందంగా, కళాత్మకంగా నన్నాకర్షించింది, దాని తీసుకుని దేవుడి పటాలని శుభ్రం చేస్తున్న అమ్మ దగ్గరికి వెళ్ళి 'ఇది ఎవరిది?' అని అడిగాను. అమ్మ దాని చేతుల్లోకి తీసుకుని 'ఇది నీదే, నీ కోసం చిన్నప్పుడు 'మూగోడు' చేసుకొచ్చాడు' అంది. నేను దాన్ని అపురూపంగా చూస్తూ మూగాడి గురించి చెప్పమని మారాం చేస్తే నేనందించిన సామాన్లని సర్దుతూ నా చిన్న నాటి సంఘటన చెప్పసాగింది.

మాది చాలా పెద్ద కుటుంబం మా తాతయ్యకి తొమ్మిది మంది సంతానం, మా నాన్న ఎనిమిదో సంతానం. అత్తయ్యలు ఐదుగురు అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయి పెదనాన్న వాళ్ళు మేము కలిసి ఉండేవాళ్ళమట, మా అమ్మ నేను నెలల పిల్లాడిగా ఉన్నప్పుడు అమ్మమ్మ వాళ్ళు ఊరునుంచి మా ఊరు తీసుకొచ్చారంట. నేను చాలా ముద్దుగా ఉండేవాడినని అందరూ నన్ను ఎత్తుకుని ఆడించేవాళ్ళంట.

కానీ వాళ్ళందరిలో "మా మూగోడు" స్పెషల్, అప్పట్లో 'మా చాకలి', 'మా మాదిగోడు, 'మా మంగలి' ఇలా ప్రతి ఇంటికీ ఉండేవాళ్ళు. వాళ్ళలో మా మాదిగ 'రోశి' కొడుకే 'మూగోడు'. చాలా తెలివైన వాడు అసలు పేరేంటో తెలీదు కానీ పుట్టుకతోనే మూగ, చెముడు అట అందుకే అందరూ 'మూగోడ'నే పిలిచే వాళ్ళు, సరే నాకు మూగోడికి మధ్య స్నేహం ఎలా అంటే..

నేను మా ఊరు తీసుకొచ్చిన రెండోరోజే మూగోడు మా ఇంటికొచ్చి నన్ను చూసి ఎత్తుకుంటానని గొడవ చేశాడట (సైగలతో) మేమేమో 'రాజులం' వాడేమో 'మాదిగ' ఎలానా ఇవ్వటం అని ఆ రోజుకి వాడికి ఎలాగో సర్ది చెప్పి పంపారట.

మరుసటి రోజు ఉదయాన్నే ఇంటిముందు మూగోడు, మళ్ళీ సర్దిచెప్పి పంపడం, తరువాత రోజు మళ్ళీ ఉదయాన్నే ఇంటి ముందు, ఇక లాభంలేదని మా మేనత్త నా బట్టలు విప్పి వాడి ముందు పెడితే, ఆనందంతో మూగోడు నన్నెత్తుకుని గుండెలకి హత్తుకుని రకరకాలుగా నన్ను ఆడించి క్రిందకి దించితే నా మొహాన చెంబు నీళ్ళు గుమ్మరించి నన్ను దగ్గరకి తీసుకుని స్నానం చేయించేవారట, ఇలా రోజు తను రావటం నేను తనని చూసి కేరింతలు కొట్టడం తను నన్ను ఎత్తుకుని గుండెలమీద తన్నించుకోవడం, మీసాలు పీకించుకోవడం ఇలా రకరకాలుగా ఆడించేవాడట.

కొన్నిరోజులకి నేను లేచి నుంచుని అడుగులు వేయటానికి ప్రయత్నిస్తున్నప్పుడు మూగోడు నన్ను చాటంత మొహం చేసుకుని ఆనందంగా చూశాడట, తరువాత రెండురోజులు రాలేదట. అందరూ ఎక్కడి కెళ్ళాడో అనుకుంటుండగా మూడోరోజు మూగోడు ఉదయాన్నే ఇంటికి వచ్చాడట. నేను వాడిని చూసి కేరింతలు కొడితే, యధాప్రకారం బోసిముద్దితో నన్ను వదలగానే మూగోడు నన్ను ఎత్తుకుని టవల్‌లో చుట్టి తీసుకొచ్చిన మూడంగుళాల చిన్ని చిన్ని చెప్పుల్ని నాకాళ్ళకి తొడిగి మురిసిపోయాడట. అవి ఎంతో అందంగా

మంచి పనితనంతో (తోలుతో) చేసి తీసుకురావటానికే రెండు రోజులు రాలేదని ఇంట్లో అందరూ వాడికి నామీద ఉన్న అభిమానానికి అందరూ ఆశ్చర్యపోయి వాడి పనితనాన్ని అందరూ మెచ్చుకున్నారట.

"అప్పుడు మూగోడు నీకు చేసుకొచ్చిందే ఇది అని చెపుతూ, అందరం నీ బుడి బుడి నడకలు చూసి ఆనందిస్తుంటే, తను నీ చిన్ని పాదాలకు శ్రమ కలుగుతుందని నీకోసం చెప్పులు కుట్టుకొచ్చాడు. మొట్టమొదట ఏ సంబంధం లేకుండా నీ అడుగులకి ఆసరాగా నిలిచాడ"ని అమ్మ చెప్పినప్పుడు నాకు మూగాడి మీద అభిమానం మరింత పెరిగింది.

***

"నేనెప్పుడన్నా ఊరికి వస్తే చిన్న పలకరింపుకే ఎంతో మురిసిపోయేవాడు. దాదాపు 20 సంవత్సరాలు అయ్యింది తనని చూసి, అందుకే ఈసారి నా మొదటి నేస్తానికి బట్టలు పెట్టి చూసి వెళదామనే అసలు ఈ ప్రయాణం" అని నేను చెప్పగానే నా శ్రీమతి

"ఐతే మీ నేస్తాన్ని చూపిస్తారన్నమాట" అంది.

"నేను వస్తున్నానని తెలిస్తే ఎక్కడున్నా రెక్కలు కట్టుకుని వాల్తాడు తెలుసా.?" అంటుండగా ట్రైన్ కరవది స్టేషన్‌లో ఆగింది.

స్టేషన్‌లో ట్రైన్ దిగి దేవరంపాడు బస్ ఎక్కిమా లచ్చమ్మ శిలదగ్గర దిగగానే తెలిసిన వాళ్ళందరూ పలకరిస్తుంటే వాళ్ళకి సమాధానం చెబుతూనే నా కళ్ళు నా నేస్తం కోసం వెదుకుతున్నాయ్, ఇంటికెళ్ళి పలకరింపులు అయిన తరువాత, అక్కని మూగోడెలా ఉన్నాడని అడిగాను.

రైలు పట్టాలు దాటుతుంటే రైలు క్రిందపడి చనిపోయాడని చెప్పింది, పాపం పుట్టుకతో చెవుడు కూడా అయినందువల్ల రైలు సౌండ్ వినిపించక చనిపోయాడని చెబుతుంటే నాకు కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

సాయంత్రం అన్నం సయించలేదు. ఆరుబయట మంచంపై పడుకుని ఆకాశంలోకి చూస్తుంటే చుక్కల్లో నా మొదటి నేస్తం.... బంగారు దారాలతో మబ్బులని కుడుతున్నాడు. నేను ఆశ్చర్యంతో "ఏం చేస్తున్నావ్ నేస్తం" అని అడిగితే తను నా వైపు చూసి "ఇన్ని లోకాలు దాటి రావాలంటే నీ కాళ్ళకి బాధ తెలీకుండా ఉండటానికి చెప్పులు కుడుతున్నా" అని నవ్వుతూ సమాధానం ఇచ్చాడు.

Click here to share your comments on this story